

విద్యను కార్పొరేటీకరిస్తున్న ప్రభుత్వాలు

కడప అర్బన్ : విద్యను కార్పొరేటీకరించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా అన్నారు. శనివారం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) 24 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని యుటిఎఫ్ భవన్‌లో ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అందులో భాగంగా ప్రజాకంటకంగా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయకపోగా సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పాల్గొన్నారు.

పవర్ జెఎసి పిఆర్‌సిని వ్యతిరేకించాలి

- ఎపి విద్యుత్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యుత్ యాజమాన్యంతో ఈ నెల 9న పవర్ జెఎసి చేసుకున్న ఒప్పందం పిఆర్‌సిని వెంటనే రద్దు చేయాలని ఎపి విద్యుత్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ జెఎసి ఒప్పుకున్న వేతన సవరణ విద్యుత్ ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ఇంజినీర్ల సంఘాలు పవర్ జెఎసి నుంచి బయటకు రావడం వాంఛనీయమని తెలిపారు. యాజమాన్యం హడావుడిగా ప్రకటించిన ఈ వేతన సవరణ ఒప్పందం ఏ ఒక్క ఉద్యోగికి మేలు చేసేలా లేదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ చేయడం కాని, 2022 ప్రకారం వేతనాలు చెల్లించడం కాని, ఇంజినీర్లకు సంబంధించి పర్సనల్ పే లో ఉంచుతామని చెప్పడం సరి కాదని పేర్కొన్నారు. ఇపిఎఫ్ టు జిపిఎఫ్ కేవలం నినాదంగా మిగిలిపోయిందని, వాటి అమలు చేయడంలో యాజమాన్యంలో చిత్తశుద్ధి లోపించిందని విమర్శించారు. మెరుగైన వేతన సవరణ కోసం, కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులైజేషన్ కోసం దీర్ఘకాలంగా ఉన్న అపరిస్కృత సమస్యల పరిష్కారానికి విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు మద్దతు ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో స్ట్రగుల్ కమిటీ చేసే ఆందోళనలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులర్ అయ్యేంతవరకు స్ట్రగుల్ కమిటీ పోరాటం చేస్తుందని కార్మికులు గమనించాలని తెలిపారు డిస్కాం నాయకులు ఎన్. శివశంకర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులందరూ లేబర్ కమిషనర్ కి వేతన సవరణపై తమకు ఉన్న అభ్యంతరాన్ని తెలియజేస్తూ వెంటనే మెయిల్ చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగే ఒప్పందాన్ని కుదుర్చుకోవడం వలన, విద్యుత్ ఉద్యోగుల్లో తీవ్ర వేదనను కలిగించిందని పేర్కొన్నారు. సమావేశంలో స్ట్రగుల్ కమిటీ జిల్లా నాయకుడు సురేంద్ర బాబు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను

విస్మరిస్తే పతనం తప్పదు

- ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిస్తే పాలకుల పతనం తప్పదని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ హెచ్చరించారు. శనివారం ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పాలకవర్గాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. గత ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి, ఉద్యోగ ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన పాలకవర్గాలు ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకుంటున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో జిఒ 117 అమలు చేసి ప్రాథమిక విద్యను పాడుచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలోమీటర్ పరిధిలోని ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతులను విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను అస్తవ్యస్తంగా మార్చివేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్ రద్దు చేస్తామన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం నేటికీ కొనసాగుతున్నదన్నారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను అమలు చేస్తామని ప్రకటించి మరో మారు ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ఎం.రఘునాథరెడ్డి, బి.లక్ష్మీరాజా, ఎ.శ్యాం సుందర్‌రెడ్డి, ఎస్.ఇక్బాల్, ఆర్.అబ్దుల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోకపోతే తగు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారని విమర్శించారు. చిన్నచిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులివ్వడం, సస్పెన్షన్లు చేయడం తగదన్నారు. ప్రవీణ్ ప్రకాష్‌ను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్‌సి, డిఎ బకాయిలను చెల్లించకపోవడం దారుణమన్నారు. జులై ఒకటో తేదీ నుండి 12వ పిఆర్‌సిని అమలు చేయాల్సి ఉండగా, కమిషన్‌ను నియమించి చేతులు దులుపుకున్నారే తప్ప విధి విధానాలు రూపొందించి అమలు చేయడం లేదని విమర్శించారు. గత పిఆర్‌సి కమిషన్ ఇచ్చిన రిపోర్టును అమలు చేయకుండా దాచి ఉంచిన ప్రభుత్వం, ఇప్పుడు నూతనంగా కమిషన్ ఏర్పాటు చేయడం వల్ల ఒరిగేదేముండదన్నారు. శాస్త్ర, సాంకేతికత అభివృద్ధి చెందిన తరుణంలో నేరుగా పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు రెండు మాసాలుగా వేతనాలు చెల్లించకపోవడం తగదన్నారు. తక్షణం ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ మొత్తాలను ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ రుణాల కొరకు, అంతిమ చెల్లింపుల కొరకు దరఖాస్తు చేసుకొని సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి రావడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు, ఉపాధ్యాయుల సమస్యలపై సంఘాలతో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఫ్యాప్టో ట్రెజరర్ వై.వెంకటసుబ్బయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇలియాస్ భాష, జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, ఎపిటిఎఫ్(257) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.భాస్కర్ రెడ్డి, నాగరాజు, బిటిఎ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఆర్.హరి కొండయ్య, జ్యోతి రామచంద్ర బాబు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఉపాధ్యక్షులు రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.రమేష్ యాదవ్ నాయకులు వై.రవికుమార్, కె.నరసింహారావు, సంగమేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, కె.గోవిందు పాల్గొనారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

కార్యకర్తలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

కడప అర్బన్ : కడప సెంట్రల్ జైలులో ఉన్న పుంగనూరు, పలమనేరులకు చెందిన 62 మంది టిడిపి కార్యకర్తలను ఆ పార్టీ నేతలు ప్రభాకర్ చౌదరి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, హరిప్రసాద్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా టిడిపి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో టిడిపి కార్యకర్తలను అప్రజాస్వామికంగా అధికార ప్రభుత్వం వెంటాడుతోందని విమర్శించారు. జగన్ రెడ్డి ప్రస్తుతం రాష్ట్రంలో అవలంభిస్తున్న విధానాలు మునుపెన్నడూ లేవని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఏదైనా చేయొచ్చనే చెడు సాంప్రదాయాన్ని సీఎం జగన్ నేర్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను ప్రతిపక్ష, రాజకీయ పార్టీల మీద కక్ష సాధించుకునేందుకు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని జైళ్ల టిడిపి కార్యకర్తలను లోపల పెట్టేందుకేనా అని ప్రశ్నించారు. ఎంతమందిని జైళ్లలో పెట్టినా భయపడమని పేర్కొన్నారు. అధికార పార్టీ చేసే ప్రతి పనినీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టిడిపి ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చేయని తప్పుకు టిడిపి వారిని జైళ్లలో పెట్టడం దారుణమన్నారు. అంతిమంగా రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది టిడిపి అన్నారు.

కెకెఆర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కడప అర్బన్



మెమోంటో ప్రదానోత్సవంలో నాయకులు

ఎంతోమంది ప్రజలకు రక్తదాన సేవలు చేస్తున్న కెకెఆర్ వ్యవస్థాపకులు తారిక్ కృషి అభినందనీయమని ప్రముఖ వైద్యులు, వైసిపి నాయకులు డాక్టర్ సోహెల్ అహ్మద్ అన్నారు. శనివారం శ్రీ శ్రీ హోలీ స్టిక్ ఆసుపత్రి సమావేశ మందిరంలో రక్తదాతలకు మెమోంటో ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ ఆసుపత్రి ఏవో శరత్ బాబు కార్పొరేటర్, వైసిపి నాయకులు, రక్త దాతలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పగిరి వివేకానందరెడ్డి పుట్టినరోజు వేడుకలు

కడప అర్బన్ : పుష్పగిరి విద్యాసంస్థల డైరెక్టర్ ఎం. వివేకానంద రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాశ్రమాలలో అన్నదానాలు, హాస్టల్స్లో విద్యార్థులకు పండ్ల పంపిణీ, పేదలకు నిత్యవసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కల జమాల్‌రెడ్డి ఎన్నిక హర్షణీయం



కడప అర్బన్ : గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలో రాష్ట్ర కో – చైర్మన్‌గా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా ఎంపిడిఒలకు ఉద్యోగోన్నతులు లేవని, వారికి వెంటనే ఉద్యోగోన్నతలు కల్పిస్తామన్నారు. పాలిటెక్నికల్, పిఆర్‌సి, విఆర్‌ఒ, విఆర్ ఎలకు ఉద్యోగోన్నతులు, కాంట్రాక్టు లెక్చరర్లకు రెగ్యులరైజేషన్ వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగాల సమస్యలను పరిష్కారం చేసే ఏకైక సంఘంగా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎదిగే విధంగా కృషి చేస్తామన్నారు.

మృతదేహానికి 'బత్యాల' నివాళి

ఒంటిమిట్ట : స్థానికంగా నివాసం ఉంటున్న సూర్యశివప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం అతని మృతదేహాన్ని ఒంటిమిట్టకు తీసుకొచ్చిన నేపథ్యంలో రాజంపేట టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్‌రాయుడు మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో బొబ్బిలిరాయుడు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, తోట ప్రసాద్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థను దెబ్బతీస్తున్న మోడీ

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న అలీఖాన్

స్వతంత్ర భారత న్యాయవ్యవస్థ లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోడీ దెబ్బతీస్తున్నారని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సుప్రీంకోర్టు భారత ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని చెప్పారు. ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకాలకు అత్యున్నత స్థాయి కమిటీని సుప్రీంకోర్టు నియమించినట్లు వివరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకంలో త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కాకుండా ఆ స్థానంలో ఓ కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి , లోక్‌సభ ప్రతిపక్ష నేత ఉంటారని చట్టం రూపొందించడం దారుణమని వాపోయారు. బిజెపికి కోర్టులు, చట్టాల పట్ల విశ్వాసం లేదని పేర్కొన్నారు. అధికార బలంతో ఉన్నత న్యాయస్థానం తీర్పులను బుట్ట దాఖలు చేసే విధంగా చట్టాలు రూపొందించడం దుష్పరిణామాలకు దారి తీస్తుందన్నారు. రాబోవు ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి ఇంటి దారి పడుతుందని జోస్యం చెప్పారు. సమావేశంలో కడప జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నాసిర్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ రహమతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

16న విద్యుత్ భారాలపై రాస్తారోకో

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై వరుసగా మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు కడప పాత బస్టాండ్ లోని పూలే సర్కిల్ వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ తెలిపారు. శనివారం నగరంలోని పాత బస్టాండ్‌లోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై 14 నెలలుగా విద్యుత్ వినియోగఛార్జీలకు అదనంగా 25 నుంచి 80 శాతం ప్రజానీకంపై అదనపు భారం మోపు తున్నారని విమర్శించారు. వినియోగదారుడు ప్రతినెలా సక్రమంగా బిల్లు చెల్లిస్తున్నప్పటికీ పాత బకాయిల పేరుతో మళ్లీ అదనపు ఛార్జీలు విధించడం ఏరకంగా సమంజసమని ప్రశ్నించారు. విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలకు వినియోగదారుడు ఏమాత్రం బాధ్యుడు కాదన్న విషయాన్ని ప్రభుత్వం గమనంలో ఉంచుకోవాలని అన్నారు. విద్యుత్ వినియోగ ఛార్జీలు మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా అదనంగా రకరకాల పేర్లతో భారం మోపడం తగదన్నారు. ఒకవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతుంటే ప్రభుత్వం మరోవైపు విద్యుత్ అదనపు ఛార్జీల పేరుతో భారం మోపుతోందని వాపోయారు. ఈ భారాలు 2025 వరకు ఈ కొనసాగే ప్రమాదముందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న భారాలను భరించేందుకు ప్రజానీకం సిద్ధంగా లేరని తెలిపారు. ఈ భారాలకు వ్యతిరేకంగా నిర్వహించే రాస్తారోకో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు చంద్ర రెడ్డి, ఓబులేసు, షాకీర్, విజయ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కడప : ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ, ఓటరు నమోదు జాబితా 2024కు సంబంధించి జిల్లాలో చేపడుతున్న ఇంటింటి సర్వేలో భాగంగా కడప నగరంలోని పోలింగ్ స్టేషన్ - 257 పరిధిలోని సరోజిని నగర్‌లో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా . ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టాలని, చనిపోయిన, వలస వెళ్లిన వారి వివరాలకు కచ్చితంగా గుర్తించి ఇంటింటి సర్వే పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శివారెడ్డి, బిఎల్‌ఒ గురులక్ష్మి, విఆర్‌ఒ శ్రావణ్ పాల్గొన్నారు.

'బొత్స'కు మతిభ్రమించింది : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం, జనసేన పార్టీలకు జనం నుంచి లభిస్తోన్న ఆదరణ, ప్రోత్సాహం చూసి మంత్రి బొత్స సత్యనారాయణకు మతి భ్రమించిందని అందుకే ఉగాది తర్వాత ఈ రెండు పార్టీలు ఉండవని ఉంటే గుండు చేయించుకుంటానని పిచ్చి వాగుడు వాగుతున్నాడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం హరిటవర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రెండు పార్టీలూ పోటీ చేస్తాయని బొత్స శిరోమండడానికి సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీ అని చంద్రబాబు గురించి బొత్స మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు పాలన తీరు అనుభవం దేశం మొత్తానికి తెలుసనీ అన్నారు. గ్రామస్థాయి నుంచి బలంగా ఉన్న పార్టీ తెలుగుదేశం ఒక్కటే అని చెప్పారు. ఒక్క ఛాన్స్ అని ప్రజలను నమ్మబలికి అధికారంలో వచ్చిన వైసిపికి ఏం తెలుసని వాపోయారు. పవన్ కల్యాణ్ మీ నాయకుడిలాగా పరదాల చాటున లేడని ప్రజల మధ్య బహిరంగంగా తిరుగుతూ మీరు చేసే అరాచక పాలనను ప్రశ్నిస్తున్నారని అన్నారు. అర్థం కాని మాటలు మాట్లాడే బొత్స తెలుకోవాలన్నారు. సమావేశంలో టిడిపి నేతలు గంధం ప్రసాద్, రవి పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆజాదికా అమృత్ మహోత్సవ్, నా భూమి–నా దేశం కార్యక్రమంలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి పేద మహిళలకు శనివారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కేంద్రం ఇచ్చిన నినాదాన్ని పురస్కరించుకుని ఆయన తన స్వగ్రామమైన రూకవారిపల్లె బృందావనంలో గ్రామ మహిళల్లో 50 మందికి స్థానిక ప్రముఖులు సుధారెడ్డి, రామిరెడ్డిల ద్వారా చీరలు, దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో 'లయన్స్' కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, గొబ్బూరి కోటేశ్వరరావు, బాబు పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలో పథకాలు : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప



డిప్యూటీ సిఎంను సన్మానిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్తస్థాయిలో అందిస్తున్నామని ఉప ముఖ్య మంత్రి ఎస్. బి అంజాద్ బాషా పేర్కొన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి సోదరుడు అహమ్మద్ బాషా, షేక్ మహమ్మద్ షఫీ, నరపు రెడ్డి సుబ్బా రెడ్డి, ఎన్ ఆర్ఐ తోట కృష్ణ, బంగారు నాగయ్య యాదవ్, రాం మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అంజాద్‌బాషా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయనకు అభిమానులు శాలువా కప్పి గజమాల వేసి ఘనంగా సన్మా నించారు. అనంతరం డిప్యూటీ సిఎం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జిల్లా ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఇల్లూ సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని ఆకాక్షించారు. ప్రజల ఆశీస్సులతో ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. వారి విశ్వాసాన్ని వమ్ము చేయకుండా తన నియోజకవర్గ ప్రజలకు సేవ అందిస్తున్నానని చెప్పారు. టౌన్‌చర్చిలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, అధికారులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

'వివేకానంద'ను ఆదర్శంగా తీసుకోవాలి

కడప : స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని లక్ష్యాలను ఎంచుకోవాలని స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ అన్నారు. శనివారం వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో స్టెప్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ' యువతకు గ్రీన్ స్కిల్స్.. స్థిరమైన ప్రపంచం వైపు' అనే నినాదంతో యువజన దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర, యువ అధికారి మణికంఠ మాట్లాడుతూ ఒక తరానికి మరో తరానికి మధ్య ఎన్నో తేడాలు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీ జగన్నాథ రెడ్డి మాట్లాడుతూ యువత తల్లిదండ్రులు, గురువులు, కోచుల సూచనలను పాటిస్తూ వారి గమ్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని తెలిపారు.

18న 'ఉక్కు' సాధన కోసం రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధన కోసం ఈనెల 18న డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్ డి.ఎం. ఓబులేసు, ఉపాధ్యక్షులు విజయ్ తెలిపారు. శనివారం పాత బస్టాండ్‌లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చి తొమ్మిది సంవత్సరాలగా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కడప ఉక్కు ఏర్పాటు కారణంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగా అవకాశాలు వస్తాయని తెలిపారు. ఓట్లు సీట్ల రాజకీయంతో బిజెపి ప్రభుత్వం కడప ఉక్కును విస్మరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటులో కడప ఉక్కు చేయడం సాధ్యం కాదని బిజెపి ప్రకటిస్తే కనీస స్పందన కూడా లేకుండా వైసిపి ఎంపీలు వ్యవహరించిన తీరు బాధ్యతారహితమన్నారు. తక్షణమే ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

పోరుబాట ప్రజాదృష్టి

జిల్లాలో కార్మికుల నుంచి ప్రతిఘటన పెరుగుతోంది. ఇటీవల కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులకు గత సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సమరశీల పోరాటం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే న్యాయమైన డిమాండ్ పట్ల ఎందుకు స్పందించడం లేదో పాలకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, క్యాబ్ డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత విధానం ప్రకారం పింఛన్ ఇవ్వాలని, ఇంజినీరింగ్ సెక్షన్ వారికి స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, మరణించిన, అనారోగ్య ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలనే న్యాయబద్ధమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ చేసిన సమరశీల పోరాటం ఆలోచనల్ని కలిగించింది. ఉద్యమాల అణచివేతకు పోలీసులను సాధనంగా వాడుకుని అరెస్టు చేయాలని చూడడం, ఈడ్చిపారేయడానికి ప్రయత్నించడం, పలువురు గాయపడడం వంటి పోరాట దృశ్యాలు సమరశీల పోరాటం తీవ్రతను తెలియజేశాయనడంలో సందేహం లేదు. పోరాటాన్ని అణచివేత పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన తరహాలోనే ఇక్కడా చేయాలనే న్యాయమైన డిమాండ్‌ను ఆలకించాల్సి ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో అడిగిన వారికి అడిగిన చందంగా వాగ్దానాలు చేసిన పాలకులు, గద్దెనెక్కిన తర్వాత మరిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే 98 శాతం హామీలను నెరవేర్చామని చెప్పుకుంటున్న పాలకులు మున్సిపల్ ఉద్యోగులను ఎందుకు రెగ్యులర్ చేయడం లేదో సమాధానం చెప్పాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికలు తరుముతున్న నేపథ్యంలో కార్మిక నాయకత్వం ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలి. పోరాటాల ద్వారానే ఫలితాలు ఉంటాయనే చారిత్రక సత్యాల్ని పోరాటకారులు గమనంలో ఉంచుకోవాలి. ఇటువంటి వివక్ష, బానిసత్వాలకు వ్యతిరేకంగా ఆదిమయుగం నుంచి ఆధునిక డిజిటల్ యుగం రూపు దాల్చే వరకు పోరాటమే ఇరుసుగా నడక సాగిందనే సత్యాన్ని కార్మిక శ్రేణులకు నూరిపోయాలి. ఇటువంటి సజీవ సత్యాలే ఉద్యమాల్ని మరింత ఉవ్వెత్తిన ఎగిసిపడేలా చేస్తాయని చెప్పవచ్చు. లేనిపక్షంలో భవిష్యత్ తరాలు నష్టపోతాయనే స్పృహను కలిగి నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వ్యత్యాసాల్ని, వివక్షల్ని బానిస బతుకులకు విముక్తి పోరాటాల రూపంలోనే అన్వేషించాల్సి ఉందనే సత్యాన్ని అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలి. ఇటువంటి తిరోగమన విధానాల్ని ఐకమత్యంతో సమర్థవంతంగా తిప్పికొట్టి తీరాల్సిందే. ఇందుకు కార్మిక లోకమంతా ఉవ్వెత్తున ఉమ్మడిగా కదిలితేనే ప్రయోజనం. లేని పక్షంలో మరో సార్వత్రిక ఎన్నిక వచ్చే వరకు బానిస, వివక్షలనే సంకెళ్లలోనే మగ్గిపోవాల్సి వస్తోందనే సత్యాన్ని గమనంలో ఉంచుకోవాలి. పోరాడితే పోయేవి బానిస సంకెళ్లు తప్ప మరేమీ లేదనే సత్యాన్ని పోరాట నాయకత్వం ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. కార్మిక ఉద్యమాల తరహాలో కర్షకులు సైతం ఉద్యమిస్తేనే రైతాంగ సమస్యలు పరిష్కారమవుతాయని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉం దనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పూజ స్కూల్ కరస్పాండెంట్, డాడీ హోమ్ నిర్వాహకులు

రాజారెడ్డి అనుమానాస్పద మృతి

మైలవరం డాడీ హోమ్‌లో అంత్యక్రియలు
పాఠశాలను పరిశీలించిన డిఎస్‌పి నాగరాజు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని పూజ స్కూల్ కరస్పాండెంట్, డాడీ హోమ్ నిర్వాహకులు రాజారెడ్డి అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. పాఠశాల ఆవరణంలో విగతజీవిగా పడి ఉన్న ఆయన్ను పాఠశాల సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకొని అక్కడి పరిస్థితిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనుమానస్పదం కింద కేసు నమోదు చేశారు. జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు పూజ ఇంటర్నేషనల్ స్కూల్ పరిశీలించి అక్కడి సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఆయన మర ణం వెనుక ఎవరు ఉంటారా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. తాజాగా రాజారెడ్డి మృతిపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో రీపో స్టుమార్టం నిర్వహించేందుకు ఫోరెన్సిక్ అధికారుల రాకతో మృత దేహాన్ని పూజ స్కూల్ నుంచి తిరిగి ఆసుపత్రికి తరలించారు. డాడీ హోమ్‌గా పిలుస్తున్న ఈ ప్రాంతంలో 150 మంది పేదలున్నారు. అనాథలు, వీధి పిల్లలు, హెచ్ఐవి సోకిన పిల్లలు, పెద్దలు, అత్యాచార బాధితులు, మానసిక వికలాంగులు, వృద్ధులు ఇందులో ఉన్నారు. డాడీ హోమ్ చాలా మందికి ఒంటరి జీవితం గడుపుతున్న వారికి ఆసరాగా ఉంటోంది. వారికి అండగా రాజా రెడ్డి ఉన్నారని భావించే వారు. ఆయన మృతితో అందులో ఉంటున్న వారిలో తీవ్ర విషాదం నెలకొంది. రాజారెడ్డి మృతి పట్ల ఆయన కుటుం బసభ్యులతో పాఠశాల నిర్వాహకులు లక్ష్మి ప్రసూన, రమణారెడ్డి, సుబ్బారెడి విషాదంతో నివాళి అర్పించారు. రాజారెడ్డి అనాథ పిల్లలను చేరదీసి వారికి చదువు, క్రీడల్లో ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఆయన మృతి చెందడంతో విషాదం నెలకొంది.



మృతిచెందిన రాజారెడ్డి



పాఠశాలను పరిశీలిస్తున్న డిఎస్‌పి నాగరాజు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

దేశ గొప్పతనాన్ని తెలుసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

దేశ గొప్ప తనాన్ని తెలుసుకోవాలని కలెక్టర్ విజయ్‌రామరాజు అన్నారు. శనివారం స్థానిక చింతకొమ్మదిన్నె సచివాలయంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి ముందుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా రోజుకు ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతరం నా భూమి నాదేశం నేలతల్లికి నమస్కారం చేశారు. సచివాలయ పరిధిలోని శిలాఫలకాన్ని ఆవిష్కరించి భారతదేశం గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ఎంపిడిఒ రవికుమార్ రెడ్డి, తహశీల్దార్ నారాయణరెడ్డి, నాయకులు కార్పొరేటర్ పాకా సురేష్, వైసిపి కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి,సుధాకర్ రెడ్డి సురేంద్రారెడ్డి, ఓబుల్ రెడ్డి, స్థానిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలి

- ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక శిరిడీ సాయి జూనియర్, డిగ్రీ కళాశాలలో జూనియర్ విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఆ కళాశాల కరస్పాండెంట్ హైమావతి, ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు మీ పైన ఎంతో నమ్మకాన్ని పెట్టి కళాశాలలకు పంపిస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కష్టపడి చదవాలని పేర్కొన్నారు. ప్రతిభ గల వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవడంలో ఇప్పటి నుంచే కృషి చేయాలని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు స్వస్తి పలికి మంచి నడవడికతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కు మార్గదర్శకులుగా ఉండాలే కానీ వారిని ఇబ్బందిపెట్టేలా ప్రవర్తించరాదన్నారు. అనంతరం కరస్పాండెంట్ హైమావతి మాట్లాడుతూ ఉన్నతమైన ఆశయంతో ఈ కళాశాలను నిర్వహించామని అందుకు తాను శాయశక్తుల కృషి చేస్తున్నామని చెప్పారు.విద్యను అభ్యసించిన వారికి ఎప్పటికైనా సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. వివేకంతో విద్యను తమ కళాశాల అందిస్తున్నదన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పొన్నపురెడ్డి శివారెడ్డి సతీమణి లక్ష్మీదేవమ్మ, కరస్పాండెంట్ హైమావతి, ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, అర్జున్ సీడ్ సదాశివయ్య, బాలాజీ హై స్కూల్ కరస్పాండెంట్ రవీంద్రారెడ్డి, అడ్వకేట్ భూతమాపురం సుబ్బారావు, టీచర్ దానం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జస్వంత్‌రెడ్డి

సిఎం జగన్‌ను విమర్శించే స్థాయి లేదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వార్డు సభ్యుడిగా గెలవలేని వ్యక్తులు సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని, వైసిపి పట్టణ విద్యార్థి విభాగం నాయకుడు పోరెడ్డి జస్వంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపికి చెందిన విజయ్ కుమార్ తన సొంత ఊరు కసునూరులో సర్పంచ్ స్థానానికి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. బిటెక్ రవికి సర్పంచ్ స్థానానికి సరైన అభ్యర్థిని నిలబెట్టే సామర్థ్యం లేదని, ఆయన నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థి కావడం తెలుగు దేశం పార్టీకే సిగ్గు చేటని విమర్శించారు. కసుమూరు సర్పంచ్ స్థానాన్ని గెలుచుకొని ఇకమీదట విమర్శలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు యోహాన్, మహీధర్, ప్రవీణ్, అర్జున్ రెడ్డి, హనీఫ్, వంశీ, ప్రతాప్ ఉన్నారు.

ఆరు సూత్రాలు అమలు : పిసిసి

ప్రజాశక్తి -చక్రాయపేట

వైసిపి, టిడిపి మేనిఫెస్టోలు కాంగ్రెస్ మేనిఫెస్టోకు సాటి రావని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మెన్ నరెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు సూత్రాలు కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. రైతులకు, మహిళలకు, పేదలకు, ప్రత్యేక హోదా యువత, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, విభజన చట్టంలో పేర్కొన్నప్పటికీ అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. కడప జిల్లాలో ఉక్కు కర్మాగార నిర్మాణం. దుగరాజపట్నం వద్ద కొత్త ఓడరేవు నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాజధాని ఏర్పాటు, విశాఖలో మెట్రో రైలు, విజయవాడలో మెట్రో రైలు, విశాఖ చెన్నై పారిశ్రామిక కార్డార్ ఏర్పాటు, తదితర అంశాలు ఉన్నాయని ఆ అంశాలన్నింటినీ ఏడాదిలోపే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ సమన్వయ కమిటీ కన్వీనర్ సెట్ నజీర్ అహమద్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిటీ సభ్యులు ధ్రువ కుమార్ రెడ్డి, వేలూరు శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ, మనోహర్ రెడ్డి, రామాంజల్ రెడ్డి, బాలన్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని మాలపాడు, ఇల్లూరు గ్రామాల మధ్యనున్న జగనన్న కాలనీ వద్దనున్న రైల్వే ట్రాక్ పై శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహాన్ని గుర్తించినట్లు స్థానిక రైల్వే పోలీసులు తెలిపారు. రైలు బలంగా ఢీకొనడంతో వ్యక్తి శరీరం పూర్తిగా ఛిద్రమైందని మృతి చెందిన వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఎవరు అనేది గుర్తించలేకున్నామని పేర్కొన్నారు. మృతునికి 50 నుండి 55 సంవత్సరాల వయసు ఉంటుందని, మృతుడు తెలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఆ చొక్కాను బిఎన్ఆర్ ప్రొద్దుటూరులో కుట్టించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు సంప్రదించాలని కోరారు.

నాసిరకంగా ‘జగనన్న’ ఇళ్ల నిర్మాణాలు

బీటలు వారుతున్నగోడలు - ఆందోళనలో లబ్ధిదారులు - పట్టని అధికారులు





బీటలు వారిన జగనన్న ఇళ్ల గోడలు, నిర్మాణమే చేపట్టని జగనన్న ఇల్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పేదల సొంతింటి కలను సాకారం చేయాలని తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న గృహాలను చేపట్టింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయి. వాటి నాణ్యత విషయాన్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం గణాంకాల కోసం ఇన్ని ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చామని చెప్పుకోవడానికే తప్ప నాణ్యత గురించి పట్టించుకోకపోవడం విచారకరం. పైగా జిల్లా స్థాయి అధికారులు గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఒత్తిడి తేవడంతో నాణ్యత ప్రమాణాలు గాలికొదిలేశారు. అడపాదడపా అధికారులే జగనన్న కాలనీలను సందర్శిస్తున్నారే తప్ప ప్రజాప్రతినిధులు అటువైపు చూసిన పాపాన పోలేదు. ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు చూస్తే ముక్కున వేలేసుకోక మానదు. స్థానిక జగనన్న కాలనీలోని ఇళ్ల గోడలు నెర్రెలు చీలి రేపో, మాపో కూలే పరిస్థితి కనపడుతుంది. ఇక్కడ పనిచేస్తున్న కొందరు కాంట్రాక్టర్లు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు కావడంతో వెన్నుకుండి అంతా తామై నడిపిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోయినా లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసి, తిరిగి మరికొంత డబ్బులు కావాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. లబ్ధిదారులు ఇల్లు మొదలు పెట్టకుండా ఎలా డబ్బులు ఇవ్వాలంటూ సదరు కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే, కడతాం లే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని సమాచారం. ఇటువంటి నాసిరకం ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన తర్వాత అందులో ఒక కుటుంబం నివాసం ఉంటుందని, జరగరాని సంఘటన జరిగితే ఎవరు సమాధానం చెబుతారంటూపలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జగనన్న కాలనీలోని ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి నాణ్యత లేని ఇళ్లకు బిల్లులు నిలుపుదల చేసి, తిరిగి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పలువురు హౌసింగ్ అధికారులను కోరుతున్నారు.

పిల్లలకు టీకాలే ఆరోగ్య రక్ష : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -ఖాజీపేట

పిల్లలకు టీకాలే ఆరోగ్య రక్ష అని డిఎంహెచ్‌ఒ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పుల్లూరు సచివాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న మిషన్ ఇంద్ర ధనుష్, డాక్టర్ వైఎస్ ఆర్ కంటివెలుగు కార్యక్రమం, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ కార్యక్రమాలను ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ డాక్టర్ ఎస్.ముబీన్‌తో కలిసి డిఎంహెచ్‌ఒ పర్యవేక్షించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో పుల్లూరు సచివాలయంలో ఆయన అమలవుతున్న కార్యక్రమాలను గురించి గర్భిణులు, బాలింతలు, అవ్వతాలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రత్యేకంగా ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోందని చెప్పారు. గర్భిణులకు పరీక్షలు, మందులు, అవసరం అయిన వారికి చికిత్సలు అందిస్తారని తెలియజేశారు. 108 అంబులెన్సు వాహనం,104 సంచార వాహనం, తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. డాక్టరు వైఎస్ ఆర్ కంటివెలుగులో భాగంగా అవ్వ తాతలకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు, ఇంకా అవసరం కంటి ఆపరేషన్ చేయించాలని కంటివెలుగు డాక్టర్‌కు సూచించారు. డాక్టర్ వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్‌లో అన్ని జబ్బులకు, మందులు నిల్వ ఉండాలని ఆయన సిహెచ్ఒలకు పేర్కొన్నారు. చిన్నారుల తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలు గర్భం ధరించినప్పటినుండి కాన్పు అయ్యే వరకు చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భం వచ్చిన తరవాత మూడు సార్లు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిఎంహెచ్‌ఒ నాగరాజు

గర్భ వాయువు రాకుండాసూదులు వేయించుకోవాలని, కాన్పుకు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి సుఖ ప్రసవం పొందాలన్నారు, ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వసతులున్నాయని ఆయన మహిళలకు తెలియజేశారు. వాక్సిన్ పెట్టెను, అందులోని టీకాల మందులను పరిశీలించారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వచ్చేది వర్షా కాలం కాబట్టి, నీటి ద్వారా వచ్చే వ్యాధులకు దూరంగా ఉండాలని, ఏదైనా ఇబ్బంది కలిగితే వెంటనే ప్రభుత్వఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని వారికి సూచించారు. ఈ నెల 17న విద్యార్థులకు తప్పక అల్బెండ్ జోల్ మాత్ర లను వేయాలన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులకు దూరంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట యం.వి.వి ప్రసాద్, కెఎస్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కడప పార్లమెంటు సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. శనివారం పులివెందులలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే నా దృష్టికి తీసుకువచ్చే వెంటనే పరిష్కరిస్తానన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి సంక్షేమ పథకాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి భారతదేశానికే వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు వారి సమస్యలు విన్నవించుకోవడానికి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి -బద్వేలు

రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ బిసిలపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాలని బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బి.సి రమణ పేర్కొన్నారు. స్థానిక బద్వేల్ బిసి చైతన్య సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గం గోరంట్ల మండలంలో సుమారు 30 మంది బిసి వర్గీయులైన వడ్డెర్లపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. వృద్ధులను, మహిళలను అని చూడకుండా రౌడీ మూకలు దాడి చేశారని, ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందని వాపోయారు. అందుకు కారకులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుమూర్తి మాట్లాడుతూ చట్టాలు కఠినంగా పనిచేసినప్పుడు ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి నాయకులు సాగర్, కత్తి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అంగళ్లు వద్ద నిజంగా దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని టిడిపి ఇన్‌ఛార్జి సి. భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 4న పుంగనూరు నియోజకవర్గంలోని అంగళ్ల వద్ద జరిగిన ఘటనలో ఏ-1గా చంద్రబాబు నాయుడుని, పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డిని ఏ-11 నిందితుడుగా చేర్చడం దారుణమన్నారు. అక్కడ ఆ సమయంలో శ్రీనివాసులు రెడ్డి లేకపోయినా కూడా పేరు చేర్చడం బాధాకరమని వాపోయారు. అంగళ్ల వద్ద జరిగిన ఘటనకు కారణమైన వైసిపి నాయకులపై కాకుండా టిడిపి వారి మీద కేసులు పెట్టడం ఏమిటన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. తప్పుడు కేసులు పెట్టిన అధికారులను తెలుగు దేశం ప్రభుత్వం వచ్చాక వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శ రమణారెడ్డి, రాష్ట్ర గాండ్ల సంఘం కార్యదర్శి విశాలాక్షి, పొన్న తోట శ్రీనివాసులు మల్లికార్జున, భూషిరెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి,రాజారెడ్డి, భూషణం,రమణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామమునిరెడ్డి

‘నామినేషన్ తిరస్కరణలో జడ్‌పిటిసి హస్తం’

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ సర్పంచ్ ఎన్నికలకు చెందిన టిడిపి బలపరిచిన పెద్దింటి లక్ష్మణ్ వేసిన నామినేషన్ తిరస్కరణలో జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి హస్తం ఉందని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మైనార్టీ నేత నిమ్మకాయల దర్బార్, పోతిరెడ్డి శివ, పిపి చెంద్రాయుడులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి అభ్యర్థి పెద్దింటి లక్ష్మణ్‌ను ఇడుపులపాయ సర్పంచ్ అభ్యర్థిగా బలపరిచి నామినేషన్‌ను వేయించామని చెప్పారు. చెప్పారు. అయితే అధికార బలంతో నామినేషన్‌ను జడ్‌పిటిసి తిరస్కరణ చేయించారని ఆరోపించారు. నామినేషన్ తిరస్కరణలో తన హస్తం లేదని అంటున్న జడ్‌పిటిసి కాణిపాకం వినాయక గుడిలో ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. లాయర్ ద్వారా నామినేషన్‌ను పూర్తి చేసి దాఖలు చేయించామని, వాటిలో తప్పులున్నాయని చెప్పడం చూస్తే వైసిపికి భయం పట్టుకుందని అర్థమవుతోందని చెప్పారు. ఇప్పటికైనా సమయం ఉందని దమ్ము ధైర్యం ఉంటే అభ్యర్థితో నామినేషన్ విత్ డ్రా చేయిస్తే మళ్లీ టిడిపి అభ్యర్థితో నామి నేషన్ వేయిస్తామని చెప్పారు. టిడిపి సత్తా ఇడుపులపాయలో ఏమిటో చూపిస్తామని అన్నారు. నామినేషన్లు తిరస్కరణకు గురి చేయడంలో జడ్‌వి టిసి తిరుగులేని వ్యక్తి అన్నారు. సమావేశంలో జిల్లా పార్లమెంట్ ఉపా ధ్యక్షుడు రామగంగిరెడ్డి, టిడిపి నాయకులు మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, వేమా నారాయణ, నర్సింహులు, పాములూరు చంటి, ఈశ్వరయ్య, భాను, చెంద్రాయుడు, గోగుల మారుతి, వెంకటయ్య, మదార్‌తో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ముద్దనూరు : మండలంలో నిర్వహించబోయే సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నరేష్ బాబు అన్నారు. మండలం లోని కొలవలి గ్రామంలో శనివారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్ర మోహన్, సిబ్బందితో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని, గడ్డివాములు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఈనెల 19న సర్పంచ్ పదవికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని ఎన్నికల కమిషన్ నియమాలను పాటించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు.

నేడు మంగపట్నంలో ‘భవిష్యత్తుకు గ్యారెంటీ’

ముద్దనూరు :మండలంలోని మంగపట్నం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పిఎ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రాష్ట్ర సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు ముందస్తుగా ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా పీర్ల పండుగ

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగిరిగుట్టలో వెలసిన బాదుల్లా స్వామి, మస్తాన్ స్వామి, హసన్ హుస్సేన్ స్వాముల పీర్ల పండగ మహోత్సవాన్ని శనివారం నిర్వాహకులు ప్రదీప్, మస్తాన్, శ్రీరాములు, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఆదివారం స్వాములను గ్రామోత్సవం ద్వారా జల్దీకి పంపిస్తారని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి ప్రముఖులు హాజరయ్యారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి

గండి శ్రావణమాసోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమ జిల్లాల్లోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రంలోని వీరాంజనేయ స్వామి శ్రావణమాసఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ పినుపోలు రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం పులివెందుల సిఎం క్యాంపు కార్యాలయంలో గండి క్షేత్రంలో నిర్వహించే వీరాంజనేయ స్వామి శ్రావణమాస ఉత్సవాల వాల్‌పోస్టర్లు కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైసిపి తొండూరు మండల ఇన్‌ఛార్జి వై.ఎస్ మధుసూదన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎంపీకి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఎంపీ మాట్లాడుతూ స్వామివారి ఉత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి పాలకమండలి సభ్యులు రామాంజనేయులు రెడ్డి, అనూష తేజ, సిబ్బంది పాల్గొన్నారు. **ఉచిత దర్శనాలు కల్పించాలి** జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామిలో భక్తులకు ధర్మ దర్శనం(ఉచిత దర్శనం) కల్పించాల్సిందిగా హిందూ దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు సుజన్ కుమార్ కోరారు. శనివారం ఆయన ఆలయ నిర్వాహకులకు వినతి పత్రం అందజేశారు.

నిధులను వెంటనే జమ చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన పంచాయతీ నిధులను వెంటనే పంచాయతీలకు జమ చేయాలని ప్రజాపక్షం కన్వీనర్ గోశెట్టి వెంకట రమణయ్య సూచించారు. శనివారం ఆయన మైదుకూరులో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన నిధులను దారి మళ్లించి పంచాయతీలను పాడే ఎక్కించడం బాధాకరమన్నారు. పంచాయతీ నిధులను దారిమల్లించిన రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. పంచాయతీ నిధులను వారి ఖాతాలో జమ చేసి పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసుల రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

మండల పరిధిలోని కొత్తపేట సమీపంలో వెలసిన అభయాంజనేయ స్వామి వద్ద ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం సహస్ర ఫౌండేషన్ అధ్యక్షులు నాగ మల్లారెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామస్తులతోపాటు గంగమ్మ గుడికి వచ్చే భక్తులు వస్తుంటారని వారు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహకరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సహస్ర ఫౌండేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** మండల కేంద్రంలోని ప్రముఖ న్యాయవాది భాస్కర్ బాబు, డాక్టర్ సునీత దంపతుల రెండవ కుమారుడు నిఖిల్ జన్మదినం సందర్భంగా శనివారం కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం మానసిక వికలాంగుల అనాథ ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ తన కుమారుని పుట్టినరోజు వేడుకలు ఆశ్రమంలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాస్టర్ ఇమ్మానియేల్, గ్రేసమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వైకుంఠ రథాన్ని ప్రాభిస్తున్న మానవత సేవా సంస్థ సభ్యులు

వైకుంఠ రథం ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని(శాంతి రథం) శనివారం మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర, మైదుకూరు అర్బన్ సిఐ చలపతి జెండా ఊపి ప్రారంభించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి అంకాలమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంకాలమ్మ గుడిలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాచనూరు చంద్ర మాట్లాడుతూ కులమతాలకు అతీత కుటుంబంలో వ్యక్తి చనిపోయి ఆపదలో ఉన్నవారికి మానవతా సేవా సంఘం తరపున చేస్తున్న కార్యక్రమాలు, వైకుంఠ రథం, బాడీ ఫ్రీజర్లు ఎంతో ఊరటనిస్తాయన్నారు. ఈ సేవా కార్యక్రమంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సేవే పరమావధిగా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల కోసం రూ.50 వేలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ రామచంద్రారెడ్డి, రామచంద్రుడు, వెంకటసుబ్బయ్య, బాబు, గిరి, లింగన్న, సుబ్బరాయుడు, చెన్నకేశవులు, వెంకటరాముడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అబార్షన్ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

అబార్షన్ చేసినా, చేయించుకున్నా, ప్రోత్సహించినా అలాంటి వారిపై చట్టరీత్యా నేరమని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి. శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వోదయ ఇంటెగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్) ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని బుడ్డాయపల్లిలో పిసిపియన్‌డిటి చట్టంపై శనివారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు, వివరాలు వెల్లడించేవారు నేరస్తులని చెప్పారు. సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమే అన్నారు. గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ నియంత్రణ -దురుపయోగనివారణ చట్టం 1994పై అవగాహన కల్పించారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి తమ ఇంటి సభ్యులకు, చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ కుతూరు, కుమారుడు ఇద్దరూ సమానమని తల్లిదండ్రులు తెలుసుకోవాలని చెప్పారు. హెచ్‌డబ్ల్యుఒ సత్యవతి మాట్లాడుతూ స్త్రీపురుషుల మధ్య వివక్ష ఉండ కూడదన్నారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించి కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి గృహ లక్ష్మి, సొసైటీ సభ్యులు చంద్రఓబులరెడ్డి, నరసింహారెడ్డి, రమణమ్మ, కౌసల్య పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిర్డ్ సొసైటీ సభ్యులు

పాస్ పోర్ట్ పోయినది

చింత దయామణి, D/O చింతా భాస్కర్‌బాబు, డోర్‌నెంబర్-5, దిరసవంచ గ్రామం, బ్రహ్మంగారిమఠం మండలం, కడప జిల్లా. మా గ్రామం నుంచి మైదుకూరుకు పనిమీద వెళ్లిన సందర్భంలో బస్ స్టేషన్‌లో నా పాస్ పోర్ట్ నెంబర్ X 8719954 గల పాస్ పోర్ట్ బుక్ పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికితే పైన తెలిపిన అడ్రస్‌కు తెలియజేయగలరు.

చింతా దయామణి, 9908832216.